క్లుప్తంగా

దేశభక్తిని పెంపొందించాలి



ప్రశంసా పత్రాలతో విజేతలు

కాకినాడ కల్చరల్: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని వైఎంసీఏ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. నన్నయ వర్సిటీ పరిధిలోని ఎంఎస్ఎన్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమలకుమారి కార్యక్రమంలో పాల్గొని స్థానిక బెరాకా బ్లెస్సింగ్ చర్చి హాల్‌లో శుక్రవారం విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. బెరాకా చర్చి పాస్టర్ జోసఫ్ బెన్ని, వైఎంసీఏ కార్యదర్శి పీజీ వీకే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు ముమ్మరం చేయండి



కరపలో సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ స్వప్న

కరప: మండల పరిధి గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు ముమ్మరం చేసి, ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని ఎంపీడీఓ కర్రె స్వప్న అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె గ్రామ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. జి.భావారం, పాతర్లగడ్డ, పెదకొత్తూరు, విజయరాయుడుపాలెం, ఉప్పలంక గ్రామాల్లో నూరుశాతం పన్నులు వసూలయ్యాయని, మిగిలిన గ్రామాల్లో ఈ నెలాఖరుకు 60 శాతం వసూళ్లు ఉండాలన్నారు. గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలన్నారు. సచివాలయ సేవలపైనా ఆమె సమీక్షించారు. గడపగడపకూ కార్యక్రమాలకు పూర్తి వివరాలతో సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆమె అన్నారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘అభ్యుదయ’ సేవలు అమూల్యం



మాధవరావుకు నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: విద్య, సాంస్కృతిక, కళారంగాలకు అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ బాదం మాధవరావు అందించిన సేవలు అమూల్యమైనవని రోటరీ మాజీ గవర్నర్ కేవీఎస్ ఆంజనేయమూర్తి అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో శుక్రవారం బాదం మాధవరావు సంస్మరణ సభ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద, కార్యదర్శి కోనాడ ప్రకాశరావు ఆధ్వర్యంలో మాధవరావు చిత్రపటానికి అంజలి ఘటించారు. ఎలెక్టర్ రోటరీ గవర్నర్ కల్యాణచక్రవర్తి, క్లబ్ సభ్యులు ఈశ్వరరావు, భగవాన్, బలరామ్, జయకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు అభినందన



డాక్టర్ చంద్రశేఖర్‌కు అభినందనలు తెలియజేస్తున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ

కాకినాడ రూరల్: ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి వ్యవస్థపకుడు డాక్టరు సంకురాత్రి చంద్రశేఖర్‌కు అభినందనలు వెల్లువెత్తున్నాయి. పెనుమర్తి వద్ద ఆస్పత్రికి వెళ్లి నేరుగా అభినందనలు తెలియజేయడంతో పాటు ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా ఆయనకు అభినందలు తెలియజేస్తున్నారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ వెంకట్రాజు, సాంబ శివ తదితరులు డాక్టరు చంద్రశేఖర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ రత్నప్రసాద్ శుక్రవారం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ అడబాల ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. చింతపల్లి సుబ్బారావు, నగేష్, బాపిరాజు, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

డీప్ వాటర్ పోర్టు వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

కాకినాడ సిటీ: లక్ష్మీ డీప్ వాటర్ పోర్టు వర్కర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికల్లో అధ్యక్షుడిగా పట్టా ధనలక్ష్మి 134 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శిగా బలసాడి వీరబాబు 65 ఓట్ల మెజారిటీ గెలుపొందారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డిలకు సంఘం ప్రతినిధులు, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రథసప్తమికి భారీ ఏర్పాట్లు

- ఆలయాల వద్ద సన్నాహాలు చేసిన కమిటీలు
- ప్రత్యేక పూజలు, కల్యాణాలకు సర్వం సిద్ధం

బోట్‌క్లబ్: రథసప్తమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించేందుకు నగరంలోని సూర్యనారాయణ మూర్తి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. బారికేడ్లు, క్యూలలో భక్తులకు తాగునీటి ప్యాకెట్లు అందచేసే ఏర్పాట్లు చేశారు. స్థానిక భానుగుడి వద్ద ఉషాఛాయా సమేత సూర్యనారాయణస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయంలోపల, బయట టెంట్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఈవో ఎం మురళీవీరభద్రరావు తెలిపారు. స్థానిక బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సూర్యనారాయణ స్వామి పూజలకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ చింతపల్లి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే సంతచెరువు వద్ద నున్న సూర్యనారాయణస్వామి దేవస్థానంలో, అయ్యప్పస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



రథసప్తమి వేడుకలకు ముస్తాబవుతున్న భానుగుడి సూర్యనారాయస్వామి దేవస్థానం

సామగ్రి ధరలకు రెక్కలు..

రథసప్తమి వేడుకులుకు ఉపయోగించే పూజా సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. చెరకు గడ రూ.10, చిన్నగ్లాసు రేగుపళ్లు రూ. 20, ఐదు ఆవు పిడకలు రూ.30 పెరిగిపోయాయి. నగరంలోని ప్రధాన సెంటర్లలో వీటి విక్రయాలు ఊపందుకున్నాయి.



రథసప్తమి వేడుకకు పూజా సామగ్రి కొనుగోలు చేసుకొంటున్న భక్తులు

కలెక్టర్‌కు జిల్లా పోలీసు సంఘం సత్కారం

కాకినాడ సిటీ: ఇంటి స్థలాల విషయంలో చొరవ చూపి ఫైళ్లను పరిష్కరించిన కలెక్టర్ కృతికా శుక్లాను పోలీసు అమరవీరుల కుటుంబాలు, జిల్లా పోలీసు సంఘం శుక్రవారం సత్కరించింది. పోలీస్ శాఖకు చెందిన 11 మంది పోలీస్ కుటుంబాల వారు, ఇద్దరు ఏపీఎస్పీకు చెందిన వారు, ఇద్దరు ఆర్మీకి చెందిన వారి కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందజేసిన కలెక్టర్‌కు ఈ కుటుంబాలు రుణపడి ఉంటాయని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్ కృతికా శుక్లాను సత్కరించిన వారిలో 11 మంది పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పి. సత్యమూర్తి, ఆర్మ్‌డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణమూర్తిలు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను సత్కరించారు.



కలెక్టర్ కృతికా శుక్లాను సత్కరిస్తున్న అమరవీరుల కుటుంబాలు, జిల్లా పోలీసు సంఘం ప్రతినిధులు

ఉపాధి పనులు కల్పించాలి

కాకినాడ సిటీ: జిల్లాలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించాలంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఉపాధి పథకానికి కేంద్రం అరకొర నిధులు విడుదల చేస్తోందన్నారు. 2022-23లో జిల్లాలో పూర్తి స్థాయిలో పనులు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కేఎస్ శ్రీనివాస్, కె.సింహాచలం, దుప్పి అదృష్టదేవుడు, రుద్రవరపు భూలోకం తదితరులు పాల్గొన్నారు.



హామీలు అమలుచేసిన ఘనత జగన్‌దే



లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- కొత్త కాకినాడ ప్రాంతంలో గడప గడపకూ..

కాకినాడ: పాదయాత్రలో నాటి ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చిన అంశాల్లో 87 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. అటువంటి సంక్షేమ ప్రభుత్వంపై ఇదేం ఖర్మ అంటూ టీడీపీ చేస్తున్న విమర్శలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన అన్నారు. స్థానిక 7, 8 డివిజన్ల పరిధిలోని కొత్త కాకినాడ ప్రాంతంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్, ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట రాగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర కొవ్వు కరిగించుకోవడానికేనని వ్యంగ్యాస్త్రం సంధించారు. మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు, చీట్నీడి మూర్తి, సంగాని నందం, రోకళ్ల సత్యనారాయణ, సిగల మధు, స్థానిక నాయకులు తొంపల తాతారావు, బత్తిన రాజు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలకు ప్రశంస

కాకినాడ సిటీ: ప్రముఖ టాక్స్ కన్సల్టెంట్ భారతం సుబ్రహ్మణ్య సీతాపతిరావు ఇటీవల రాష్ట్రంలోని అనేక కళాశాలల్లో విద్యార్థులకు వస్తు సేవల పన్ను చట్టంపై (జీఎస్టీ) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యావిధానానికి అనుసరించి ఆయన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయన వికాసలో భాగంగా సీతాపతిరావు విశిష్ట సేవలను ప్రభుత్వం గుర్తించింది. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆయనను ప్రశంసా పత్రంతో సత్కరించారు.



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సుబ్రహ్మణ్య సీతాపతిరావు

పరీక్షా పే చర్చలో ప్రధానితో కరప విద్యార్థి

కరప: న్యూఢిల్లీలో శుక్రవారం ప్రధాని మోడి ‘పరీక్ష పే చర్చ–2023’ నిర్వహించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు వెళ్లగా, ఒకరు కరపలోని మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థి తగరంపూడి ఇస్సాకు (10వ తరగతి). పాఠశాలలో ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, సమగ్రశిక్ష ఏఎంఓ ఎం.రామారెడ్డి విద్యార్థులతో కలసి శుక్రవారం ప్రత్యక్షప్రసారాన్ని వీక్షించారు. ప్రధానిని కలిసే అవకాశం లభించిన ఇస్సాకుకు వారు అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీతో సెల్ఫీ తీసుకున్నట్టు ఇస్సాకు తెలిపాడు.



ప్రధాని మోదీతో సెల్ఫీ తీసుకున్న ఇస్సాకు

రహదారి భద్రత వారోత్సవాల ప్రారంభం

కాకినాడ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఆర్టీసీ నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాల ప్రారంభ సమావేశం శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంవీఐ ఎం హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సురక్షిత డ్రైవింగ్‌కు పలు సూచనలు ఇచ్చారు. రెండేళ్లలో జరిగిన ప్రమాదాల గణాంకాలను డీపీటీవో ఎం శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరరావు, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ, సర్పంచ్ నాగేశ్వరరావు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా సిద్ధమవ్వాలని ఆయన కోరారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ మండపాక దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, రాష్ట్ర హస్టరీ కార్పొరేషన్ డైరెక్టరు పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చంద్రరావు ట్రస్ట్ చైర్మన్ పుల్ల చందు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, భావనారాయణ స్వామి ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, హెచ్ఎం కృష్ణమూర్తి, ఎంపీటీసీ గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాభారతి పేరిట జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మితో కలసి ఆయన 215 మందికి ఈ మెటీరియల్ అందజేసి వీటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు పొందాలని సూచించారు. వేములవాడ, నడకుదురు, అరట్లకట్ట గ్రామాల్లో విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ పంపిణీచేశారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, వేములవాడ, అరట్లకట్ట సర్పంచ్‌లు కమిడి మంగాదేవి, గోపి సత్యవేణి, సోడగం సూరిబాబు, హెచ్ఎంలు యు.లీలామనోహర్, ప్రత్తి సత్యనారాయణ, వి.సుజాత, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.



కరపలో ఎంపీపీ శ్రీలక్ష్మితో కలసి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు

రంగస్థల కళాకారుల సంక్షేమానికి జమున కృషి

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యనారాయణపురంలో నివసించే జమున స్నేహితురాలు అమ్మణీబాయిని చూసేందుకు గతంలో జమున వచ్చేవారని అమ్మాణిబాయ్ మనవడు, ప్రస్తుత యంగ్‌మెన్స్ హాపీ క్లబ్ కార్యదర్శి ఓవీఎన్ వరప్రసాద్ తెలిపారు. తన అమ్మమ్మ, సినీ నటి జమున మంచి స్నేహితులే కాక రంగస్థల వేదికలు పంచుకున్నారని ఆయన తెలిపారు. జమున రాష్ట్ర రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలిగా పనిచేసి వారి సంక్షేమానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఆమె మృతికి స్థానిక కళాకారులు పంపన దయానంద బాబు, పుల్లారావు, కాటమరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

లంపీ స్కిన్ నియంత్రణకు మందుల వితరణ



మందులను అందజేస్తున్న మార్వాడీ సంఘం ప్రతినిధులు

కాకినాడ సిటీ: లంపీ స్కిన్ వ్యాధికి గురై అల్లాడుతున్న గోవులను రక్షించేందుకు మార్వాడీ సంఘం ప్రతినిధులు రూ.20 వేల విలువైన మందులను సమకూర్చారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో మందులను అందజేశారు. ఏడీసీ ఆ సంఘం ప్రతినిధులను అభినందించి మాట్లాడుతూ ఈ వ్యాధి బారిన పడిన పశువులకు మూడు డోసుల వ్యాక్సినేషన్ అవసరమని, ఇందుకు రూ.1000 నుంచి రూ. 1200 వరకు ఖర్చు అవుతుందన్నారు. వీటి కోసం కార్పొరేషన్ పరిధిలో సంచరించే పశువులకు వ్యాక్సిన్ కోసం గతంతో ప్లానింగ్ సెక్రటరీలు రూ.50 వేలు సొంత నిధులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, జైన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న గాత్ర కచేరీ



కీర్తనలు గానం చేస్తున్న మధురై శివగణేష్, వాద్యకారులు

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు మధురై శివగణేష్ గాత్ర కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో 75వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మధురై శివగణేష్ (చెన్నై) గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. సరసాంగిరాగంలో నీకేల దయరాదు.., గంభీరనాట్ట రాగంలో జలంధరా.., భుజంగరాగంలో నందబాలం.. తదితర కీర్తనలు ఆలపించారు. బీవీ రాఘవేంద్రరావు వయోలిన్, కె.సద్గుర్ చరణ్ మృదంగం, కె.శ్రీనివాస్ కంజిరతో చక్కని వాద్య సహకారం అందజేశారు. సభాధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఎం.నాగేశ్వరావు, ఆర్‌ఏ రావు, భారతలక్ష్మి, ఎస్‌కెవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు, డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరావు, ఆలపాటి లక్ష్మిసుభద్ర, చావలి రామనాథం తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ బౌ విజేతలకు ఎస్పీ అభినందనలు



స్వర్ణ పతకాలు సాధించిన విజేతలను అభినందిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జాతీయ స్థాయి క్రాస్ బౌ షూటింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన బాలలు వేదవీక్షిత్, కార్తికేయ, సత్యనారాయణ, సాధిక్ ఖాన్‌లను ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శుక్రవారం ఆయన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రం నుంచి కాకినాడ ప్రో షూటింగ్ అకాడమీకి చెందిన షూటర్లయిన బాలలు నలుగురూ స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారని ఎస్పీ అన్నారు. ఎస్‌బీ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఇతర అధికారులు ఉన్నారు.

అజ్మీర్ పర్యటనకు బషీర్ ఎంపిక

కాకినాడ: రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో ఈనెల 29న జరగనున్న శ్రీశ్రీ అజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ పర్యవేక్షణలోని 811వ గంధోత్సవానికి రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పవిత్ర చాదర్ సమర్పించేందుకు కాకినాడకు చెందిన బషీరుద్దీన్‌తో పాటు సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ ఫరూక్ అలీ, విశాఖజిల్లాకు చెందిన కార్పొరేటర్ బర్‌ఖత్ అలీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఈ అరుదైన అవకాశం దక్కిందని మైనార్టీసెల్ నగర అధ్యక్షుడు ఖాలిద్ బిన్ వలీ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జాఫర్ ఖాన్ పేర్కొన్నారు. ఇందుకు తోడ్పడిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి వీరు అభినందనలు తెలిపారు.



రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్







